"మళ్ళీ ఎందుకొచ్చావ్ ?" అన్నాడు ఉదుకుమోత్తనంగా.

"నిన్ను పెళ్ళి చేసుకోడానికి !"

"బలవంతంగానా ?"

"అప్పుడలా చెప్పకపోతే అమ్మ నూతిలో దిగి చచ్చిపోతాననంది."

"ఇప్పుడు మళ్ళీ అంటుంది."

"అనడానికి.........అమ్మలేదు."

పాపారావు వీణ కళ్ళల్లోకి చూశాడు.

"నిజంగా— అమ్మపోయి రెండు నెలలయ్యింది. నువ్ లేకుండా బతకలేను."

"వద్దు వీణా ! ఈ కోర్టులు గొడవలు నే పళ్ళేను."

"నేనిప్పుడు స్కూల్ రికార్డు ప్రకారం, పంచాయతీ రికార్డు ప్రకారం....అన్నివిధాలా మేజర్నే !"

వాళ్ళకి సూర్యుడు, చంద్రుడు చెరో పక్కనించి ఉదయిస్తున్నట్టు అనిపించింది. (జ్యోతి—ఏప్రిల్ 83)

---

# నీ శత్రువు నువ్వే!

ఆ సలహా చెప్పినందుకు మాధవికి అంత కోపం వస్తుందని నేను అనుకోలేదు.

కాని వచ్చింది. చాలా కోపం వచ్చింది. ఎంత కోపం వచ్చిందంటే శ్రేయోభిలాషిని, తనకి ఎన్నో ఉపకారాలు చేసినవాణ్ణి, తనని ఎంత ఆదరించి, అభిమానించిన నాతోటే మాట్లాడ్డం మానేసింది.

అసలు నన్ను చూస్తేనే మొహం పక్కకి తిప్పుకుంటోంది. అంతే కాదు—నేనే చొరవ తీసుకుని మాట్లాడబోతే విదిలించి కొట్టింది.

నాకు చాలా కోపం వచ్చింది.

కాని ఒక్క విషయం మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. ఆమెకి అంత కోపంవచ్చి నాతో మాట్లాడ్డం మానేస్తుందని తెల్సినా నే నామెకు ఆ సలహా ఖచ్చితంగా ఇచ్చి ఉండేవాణ్ణి.

ఎందుకంటే స్నేహానికి, అభిమానానికి అతీతమైంది 'మానవత్వం' అనేది ఒకటుంది కదా!

*    *    *

కట్నాల పేరుతోనో, మరోరకంగానో ఆడాళ్లని దారుణంగా చంపేస్తున్న భర్తల గురించి పేపర్లో చదివి ఆవేదనపడే అనేకమందిలో నేనూ 'ఒకణ్ణి!'

ఒక్కరోజు పెళ్ళాంతో పోట్లాడి ఆఫీసుకెడితే 'అరె బాధపెట్టామే!' అని సాయంత్రందాకా బాధపడతాను. ఆ రోజంతా ఆఫీసులో సరిగా పని చెయ్యలేను. చచ్చినా ఎకౌంట్ టాలీకాదు. మరి ఈ మొగసన్నాసులు కట్నం తేలేదని పెళ్లాల్ని— 'హిట్లర్ యూదుల్ని చంపినట్టు ఎలా చంపేస్తున్నారో' అని చలించిపోతాను.

ఇలాంటి హత్యల ప్రతిదాని వెనకాల అత్తగారో, ఆడబడుచో— ఓ ఆడదాని హస్తం ఉందని పేపర్లు చెప్పక చెప్తున్నాయి: అంతమాత్రం చేత మొగాళ్ల కిరాతకాన్ని తక్కువ అంచనా వెయ్యడం కాదు.

తోటిమనిషి చావుకి కారణమైనవారు ఎవరైనా స్త్రీ పురుష బేధం లేకుండా కిరాతకులే!

మరి కిరసనాయిలు, అగ్గిపెట్టె అవుసరం లేకుండా తోటివార్ని— ఒక్కర్ని కాదు ఇద్దర్ని కాదు—ముగ్గురు తోటి ఆడవాళ్లని పతనావస్థకు తెచ్చిన మాధవి లాంటి వాళ్లని సహించి, క్షమించి, ఎలా ఊరుకోగల్ను.

ఊరుకోలేను గాక ఊరుకోలేను.

అందుకే ఆ సలహా చెప్పాను!

అందుకే మాధవికి నామీద కోపం వచ్చింది.

అసలు కథేమిటంటే....

నేను ఉద్యోగంలో చేరిన మొదటి రోజునే నాకు వీరాస్వామి పరిచయం అయ్యాడు. నాకు ఆఫీసు పని నేర్పమని మా మేనేజర్ నన్ను వీరాస్వామికి అప్పజెప్పాడు.

పరిచయం అయిన గంటలోనే నాకు వీరాస్వామిమీద గౌరవం ఏర్పడింది. అతను ఎంతో మర్యాదస్తుడు, నెమ్మదస్తుడు — సంస్కారి.

అతనిది సూక్ష్మదృష్టి ప్రతి విషయాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకునే మనస్తత్వం. అతను ఆఫీసు పనిలో మంచి దిట్ట. అతని దగ్గర పని నేర్చుకోడం చాలా థ్రిల్లింగ్‌గాను, హాయిగాను ఉండేది.

వీరాస్వామికి జీవితం మీద కొన్ని ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయి. ప్రొద్దున్నే చదివే పేపరు దగ్గర్నుంచి స్నేహితుల విషయంలోను, బంధువుల విషయంలోను, ఉద్యోగం విషయంలోను ఆఖరికి తను చూసే సినిమాల విషయం వరకు కొన్ని ఖచ్చితమైన అభిప్రాయాలు ఏర్పర్చుకుని వాటిని తు.చ. తప్పకుండా పాటిస్తాడు.

అలా ఓ పద్ధతి ప్రకారం నడిచేవాళ్ళంటే నాకు ఎనలేని గౌరవం— ప్రతి విషయం మీద ముందుగా చక్కని అవగాహన ఏర్పర్చుకుంటాడు. ఇందిరా గాంధీని ఆమె నాయకత్వాన్ని ఎంతలా మెంచుకుంటాడు— ఆమె విధించిన ఎమర్జెన్సీని అంతలా వ్యతిరేకిస్తాడు. దేన్ని గుడ్డిగా నమ్మడం, గుడ్డిగా అనుసరించడం అతని కిష్టంలేని పనులు.

నాకు చాలా తక్కువ కాలంలోనే అతను గురువు, హితుడు, స్నేహితుడు, అన్నీ అయిపోయాడు.

నేను నిస్తారం వాళ్ళింటికి వెళ్ళేవాణ్ణి. అతని భార్య మాధవి.

ఆమె నన్ను ఎంతో ఆదరించి అభిమానించేది. అన్నీ బాగానే ఉన్నాయి కాని—వీరాస్వామి అనారోగ్యవంతుడు.

ఎప్పుడూ ఏదోఒక రకమైన నలతతో బాధపడేవాడు. అతనికి తల్లి, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. స్వంత ఊళ్లో రెండెకరాల పొలం ఉంది. అతన్ని బాధించే మరో విషయం ఏమిటంటే అతని తల్లికి, పెళ్ళానికి సరిగ్గా పడదు.

అందువలన తల్లి చెల్లెళ్ళు అతని స్వగ్రామంలోనే ఉండేవారు.

తాను ఒక్కగానొక్క కొడుకైనందుకు తల్లిని, చెల్లెళ్ళని తన దగ్గర పెట్టుకునే అవకాశం లేకపోయినందుకు అతను బాధపడేవాడు. ప్రతి నెల తల్లికి కొంత డబ్బు పంపేవాడు. దానితోను, పొలంమీద వచ్చే పంట తోను తల్లి చెల్లెళ్ళు కాలక్షేపం చేసేవారు.... ఆ వయసులో తల్లి తన దగ్గర కాకుండా, వేరేచోట ఉంటోందని అతను నా దగ్గర చాలాసార్లు బాధపడ్డాడు.

ఒకవేళ పెళ్లాన్ని కాదని తల్లిని, చెల్లెయిలను తన దగ్గర పెట్టుకున్నా రోజూ యుద్ధమే। ఆ ప్రయోగమూ అయ్యింది. కుదరక మానేశాడు.

"చెల్లాయిలు అమ్మని కంటికిరెప్పలా చూచుకుంటారు. ఎక్కడో అక్కడ ఆవిడ హాయిగా ఉండటం కావాల్సింది." అని పైకి అని తృప్తిపడేవాడు కాని— అంతరాంతరాలలో అతను ఆ విషయమై ఎంత బాధపడేవాడో నాకు తెలుసు.

చెల్లెళ్ళిద్దరూ పెళ్ళి కెదిగారు. వీరాస్వామి పెద్దగా కూడబెట్టిందేమీ లేదు. పిత్రార్జితంగా వచ్చిన రెండెకరాలు అమ్మేసి వాళ్ళ పెళ్ళిళ్ళు చెయ్యాలని అతని ఆలోచన.

అందుకు ప్రయత్నాలు కూడా ప్రారంభించాడు.

నెలలు, సంవత్సరాలు గడుస్తున్నాయి. మా స్నేహం వృద్ధిపొందుతూనే ఉంది. అతని చెల్లెళ్లకి పెళ్ళి కుదరనేలేదు.

అతని అనారోగ్యం మాత్రం ముదిరిపోతూనే ఉంది. అనేకచోట్ల రకరకాల వైద్యాలు చేయించాడు. కాని రోగం మాత్రం తగ్గలేదు. చివరికి హాస్పిటల్లో చేర్పాల్సిన పరిస్థితి ఏర్పడింగి.

అతను హాస్పిటల్లో ఉన్నన్నాళ్ళు నేను తోచిన విధంగా సాయం చేస్తూనే ఉన్నాను. నేనే కాదు— అతని స్నేహితులు చాలామంది సాయంచేశారు. కాని ఎవరి సాయమూ పనికిరాలేదు.

ఆ వయసులో ఆ తల్లికి పుత్రశోకం తప్పే యోగంలేదు. ఆ వయసులో మాధవికి మొహాన కుంకుమ యోగంలేదు. నాకు మంచి స్నేహితుడు ఉండే యోగంలేదు.

వీరాస్వామి పోయాడు.

రెండు నెలలపాటు చావు బ్రతుకుల మధ్య ఊగిసలాడాడు. అతని వైద్యం కోసం ఆ తల్లి, పెళ్లాం పడ్డ యాతన— అతన్ని బతికించుకోవాలని వాళ్ళు పడ్డ ఆరాటం వర్ణనాతీతం....ఇన్నాళ్ళు అతని ఆరోగ్యం ఆ కుటుంబానికి పెద్ద సమస్య. అతని మరణంతో సమస్యకు పరిష్కారం దొరికిందా? సమస్య కొత్త మలుపు తిరిగిందా? 'అసలు సమస్య' ఇప్పుడే మొదలైందా?

మాకు ప్రీతిపాత్రమైన స్నేహితుడు—అందులోను ఆ వయసులో పోయాడని బాధపడ్డాం. ముఖ్యంగా మాధవిని చూస్తే గుండె చెరువై పోయింది.

మనిషి పోయాడని బాధపడి వగచి ఉపయోగం లేదుకదా— జరగవల్సినదాన్ని గురించి నేను, మరో ఇద్దరు స్నేహితులు బాగా ఆలోచించాం.

ముందుగా మాధవికి రావల్సిన పెన్షన్ గ్రాట్యుటీ వగైరా ఖరారు చేయించాం. మూడు నెలలు పోయాక ఆమె కాస్త తేరుకున్నాక మాధవి చేత అప్లికేషన్ పెట్టించి మా ఆఫీసులోనే ఆమెకు ఉద్యోగం వచ్చేటట్టు ఏర్పాటు చేయించాం—

మాధవి సమస్య ఒక రకమైందైతే వీరాస్వామి తల్లిది మరో రకమైన సమస్య.

ఏది ఏమైనా ఇలాంటి సమయంలో మాధవి అత్తగార్ని, ఆడబిడ్డల్ని దగ్గర పెట్టుకుంటే బావుండునని నేను ఆశించాను.

మాధవికి వీరాస్వామి మీద ప్రేమ ఉండేది. ఆమె అతన్ని ఇష్టపడేది. అందుచేతనైనా అతని తల్లిని, చెల్లెళ్ళని తను చూస్తే అతని ఆత్మకు శాంతిచేకూరుతుంది. అదేవిషయం సలహాలా మాధవికి చెప్పాను.

ఆమె మనసులో ఏముందో తెలియదు కాని విని మౌనంగా ఊరుకుంది. ఆ విషయం ఆమెతో మళ్ళీ నేనుమాట్లాడలేదు. ఆమె కుటుంబ విషయాలలో మరీ తలదూరుస్తున్నట్టుగా ఉంటుందని అనిపించింది.

కొన్నాళ్ళుపోయాక మాధవిని ఆఫీసులోనే అడిగాను—"ఏమ్మా—మీ అత్తగారెలా ఉన్నారు!" అని.

"ఆవిడ, కూతుళ్లు మళ్ళీ వాళ్ళ ఊరు వెళ్ళిపోయారు. ఆవిడకి కోడలు సంపాదన మీద బతకడం ఇష్టంలేదట"అని చెప్పింది మాధవి.

మాధవి, మాధవి తల్లి, మాధవి తమ్ముడు కల్సి ఉంటున్నారని నాకు తెల్సింది.

ముసలావిడ అలా అని వుండదని 'నీకు నీ కూతుళ్లకి తిండి పెట్టాల్సిన బాధ్యత నాకు లేదు. ఫో' అని మాధవి అని ఉండకపోయినా—వాళ్ళు ఉండలేని పరిస్థితులు కల్పించి ఉంటుందని నాకు గొప్ప నమ్మకం ఏర్పడిపోయింది.

వీరాస్వామి మరణంవలన మాధవికి బోలెడు డబ్బు వచ్చింది. దానిమీద బోలెడు వడ్డీ వస్తోంది. వీరాస్వామి మరణంవలన మాధవికి ఉద్యోగం వచ్చింది. మంచి జీతం వస్తోంది. వీరాస్వామి మరణంవలన ఆమెకు ఇంతని పెన్షన్‌వస్తోంది 'అతను' లేడన్న బాధ తప్పిస్తే ఆర్థికంగా ఆమెకేమీ లోటులేదు. మరి అతని మరణం వలన వచ్చిన ప్రయోజనాల్ని అనుభవిస్తూ— అతని మరణంవలన వచ్చిన బాధ్యతల్ని పట్టించుకోకపోవడం అన్యాయం కాదా!

ఈ విషయం మాధవి ఆలోచించి ఉంటే ఎంత బావుండేది?

ఎందుకు మనుషులు సంకుచితంగా ఆలోచించి తోటి మనుషుల్ని క్షోభ పెడతారు!

ఈ ప్రశ్నలు నా మనసులో ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. మాధవి ఎప్పుడేనా కనబడితే పలకరించడం తప్పించి నేను ఆమె కుటుంబ విషయాలు, ఆర్థిక విషయాలు పట్టించుకోడం మానేశాను—

కాలం జరిగిపోతోంది. ప్రపంచంలో సూర్యోదయమూ అవుతోంది. చీకటీ విజృంభిస్తోంది. జీవితంలో మంచి బతుకుతోంది. చెడుగు బతుకుతోంది. మంచిమంచిగా ఉంటోంది. చెడుగు చెడ్డగా ఉంటోంది.

దేన్ని దాన్ని వేరుచేసి చూడలేని జనానికి మాత్రం దృష్టిమాంద్యం ఉంటుంది.

ఆ రోజు ఆఫీసు అడ్రస్‌కి నాకో ఉత్తరం వచ్చింది. దస్తూరి కొత్తగా ఉంది. స్వర్ణ అనే అమ్మాయి రాసినట్టుగా ఉంది. స్వర్ణ అనే అమ్మాయి నా పరిచయస్తుల్లో లేదు. ఎవరా అని కొంచెంసేపు ఆలోచించాను. ఊరు ఏదా అని చూశాను.

'ఆ—గుర్తుకొచ్చింది.'

స్వర్ణ వీరాస్వామి చెల్లెలు. ఉత్తరంచదివాను. దానిలో సారాంశం—

వీరాస్వామి తల్లి, చెల్లెళ్ళు స్వంత ఊళ్లో ఉంటున్నారు. మాధవి వాళ్ళని తనతో ఉండమని అనలేదట— ఉన్న రెండెకరాల మీద వచ్చే రాబడి వాళ్ళకి కటాకటిగా సరిపోతోందట. వీరాస్వామి చెల్లెళ్ళు ఇద్దరూ కుట్టుపని చేసి కొద్దిగా సంపాయిస్తున్నారుట. వీరాస్వామి పోయాక అతని తల్లి బెంగపడి మంచాన పడిందట— ఈ మధ్య మాధవి వాళ్లూరెళ్ళి— ఆ రెండెకరాలు తన పేర రాయమని పేచీ పెట్టిందట—"ఉన్న రెండెకరాలు నీకు రాసేస్తే ఆడపిల్లలు పెళ్లిళ్ళు ఎలాకాను? నేనీ బతుకు చివరంటా ఎలా ఈడ్చేను" అని వీరాస్వామి తల్లి గోల పెట్టిందట. అవన్నీ తన కనవసరమని—రెండెకరాలు తనకి రాయకపోతే కోర్టుకి వెడతానని బెదిరించి వచ్చేసిందట మాధవి—

స్వర్ణ ఈ విషయాలన్నీ విపులంగా రాసి చివర్న "అమ్మ మీకీ విషయాలు రాయమంది. ఒదిన కనక ఆ రెండెకరాలు తీసేసుకుంటే మేం ముగ్గురం వీధిన పడతాం కాస్త ఈ విషయంలో మా మీద దయచూపమని ఒదినకి మీరు నచ్చచెప్తారని ఆశిస్తూ మీకీ ఉత్తరం రాస్తున్నాను" అని రాసింది.

ఉత్తరం చదివాక నాకు మనసులో బాధ సుడిలాతిరిగింది. మాధవి ఎందుకంత నిర్దయగా ప్రవర్తిస్తోందో అర్థంకాలేదు.

నిర్దయకు మించిన చెడులక్షణం మానవజాతికి మరోటి లేదేమో!

మాధవికి నచ్చజెప్పాలని మంచి—చెడుగుల మధ్యనున్న తేడా వివరించాలని అనుకున్నాను. ఓ రోజు ఆమె పనిచేస్తున్న డిపార్టుమెంటుకి వెళ్లి ఆమెతో మాట్లాడాను. తాను చెయ్యబోయే పని వీరాస్వామి ఆత్మకు శాంతిచేకూర్చదని ఖచ్చితంగా చెప్పాను తోటి మనుషులుగా అంతకు మించి దిక్కులేని ఆడవాళ్ళుగా అత్తగారిమీద, ఆడబడుచుల మీద దయ చూపించమని కోరాను....

పెద్దపులిని కూర్చోబెట్టి భగవద్గీత వినిపించడం ఎంత నిరుపయోగమో మాధవికి మంచి చెప్పడం అంతేనని నాకు తర్వాత తెల్సింది.

ఈ విషయాలు ఆమెతో మాట్లాడాక మాధవి నాతో మాట్లాడటం మానేసింది. నేను ఎదురుపడితే మొహం పక్కకి తిప్పుకుని వెళ్ళిపోతోంది—

కొన్నాళ్ళుపోయాక ఆఫీసు పనిమీద విజయవాడ వెళ్ళడం జరిగింది వీరాస్వామి స్వగ్రామం అక్కడికి దగ్గర.... ఓ రోజు వీలుచేసుకుని వెళ్ళి అతని తల్లిని, చెల్లెళ్ళను చూసివద్దామని వెళ్లాను

మాధవి రెండెకరాల పొలం కోసం ప్లీడరుచేత నోటీసు ఇప్పించిందని, కోర్టులు. కేసులు యాతనలు పడలేక తనంతట తానే రెండెకరాలు మాధవికి రాసిచ్చేసానని వీరాస్వామి తల్లి చెప్పింది.

అప్పడాలు, వడియాలు అమ్మి— ఎవరో ఉద్యోగస్తులకి అన్నం వండిపెట్టి— ఆవిడ, కూతుళ్ళు కాలక్షేపం చేస్తున్నారు.

మూడు బతుకులు కొన్నేళ్ళపాటు అలా వెళ్ళమార్చాలి! కిరసనాయిలు, అగ్గిపెట్టె అవుసరం లేని స్త్రీ హత్యలు!!

ఆడాళ్లని మగాళ్ళు చంపుతున్నారా? మగాళ్ళని ఆడాళ్ళు చంపుతున్నారా? మగాళ్ళని మగాళ్ళు చంపుతున్నారా? ఆడాళ్ళని ఆడాళ్ళు చంపుతున్నారా?—అసలివి ప్రశ్నలు కాదు—

మనిషిని మరో మనిషి చంపుతున్నాడు. చంపడం రకరకాలు— నీ శత్రువు నువ్వే— నా శత్రువు నేనే.... మన శత్రువులం మనమే !!!

(యువ మార్చి 85)